లగ్నభావము

లగ్నమునకు మూర్తి అంగము తనువు ఉదయము వపు కల్పము ఆద్యము అని పేర్లు. లగ్నాధిపతి పాపసహితుడై వ్యయరిపుమృతిస్థానములయందున్నచో శరీరసౌఖ్యముండదు. వ్యయరిపుమృతులయందు వానివాని అధిపతులు యున్ననూ ఇదియే ఫలము తెలియవలెను. లగ్నమునందు క్రూరగ్రహముండి లగ్నాధిపతి బలహీనుడైనచో ఆ జాతాకుడు నానాప్రకారములైన శరీరబాధలచే పీడించబడువాడగును. లగ్నాధిపతి స్వగృహమునందున్నచో లేక బుధ గురు శుక్రులచే కూడి కేన్ద్రమందున్నచో లేక స్వకీయ ఉచ్చస్థానమునందున్నచో లేక మిత్రుని గృహమునందున్నచో శుభగృహమునందున్నచో శుభగ్రహములచో చూడబడినచో ఆ జాతకుడు పుణ్యశీలుడు, జనులయందు సర్వమాన్యుడు, సర్వసంపదలచే యుక్తుడు, జ్ఞానీ, మంత్రి, రాజసమానుడు, సుందరమైన నేత్రములు కలవాడును నగును. లగ్నమునందు పాపగ్రహముండి లగ్నాధిపతి పాపగ్రహరాశియందున్నచో లేక సూర్యచంద్రులు పాపగ్రహములమధ్యయున్నచో లేక సూర్యునకుగానీ లేక చంద్రునికి గానీ సప్తమమునందు కుజుడున్నచో, లేక పృష్ఠోదయరాశియందు బుధుడున్నచో జాతకుడు మనస్వీ, దుష్టకార్యములు జేయువాడు, ఇతరుల ఇండ్లయందు నివసించువాడు మరియు క్షీణశరీరము కలవాడునూ అగును.

**ద్వితీయభావము**

ద్వితీయాధిపతి తన రాశియందు లేక కేంద్రమునందు గురునితో కూడియుండిన సర్వసంపదలతో కూడినవాడగును. కానీ గురుయుతుడగు ధనాధిపతి త్రికములందున్నచో జాతకుడు కష్టములకూడినవాడు మరియు ధనహీనుడూ నగును. ద్వితీయవ్యయాధిపతులు శుక్రుడు మరియు లగ్నాధిపతితో కలిసి త్రికములందున్నచో జాతకుడు నేత్రహీనుడు, పాపగ్రహయుతుడైన చంద్రుడు శుక్రయుక్తుడై ధనభవనమునందున్న జాతకుడు నేత్రహీనుడగును. శుక్రుడు చంద్రసహితుడై త్రికమునందున్నచో జాతకుడు రాత్రి అంధుడగును.

సూర్యశుక్రులతోకూడిన లగ్నాధిపతి త్రికములందున్న జాతకుడు జన్మాంధుడగును. ఇదే విధముగ తల్లి తండ్రి సోదరులు భార్య మొదలగు వారి స్థానములనుండి తెలియనగును.

## తృతీయభావము

భ్రాతృస్థానాధిపతి మరియు కుజుడు వ్యయరిపునిధనస్థానములందున్న జాతకుడు బంధుహీనుడగును. ఇక్కడ బంధవులనగ సోదరభావముతో గ్రహించవలెను. అదే తృతీయాధిపతి స్వస్థానమునందుడి శుభదృష్టి కలిగియుండిన సోదరబంధువులతో కూడియుండును. తృతీయాధిపతి కేంద్రమునందుండి శుభగ్రహములతో కూడియుండిన బంధుసుఖము ప్రాప్తించును. పాపగ్రహములచే చూడబడిన ప్రాప్తించదని తెలియవలెను. ఇటులనే మిగిలిన అన్ని విషయములనూ శుభపాపగ్రహ యుతి దృష్ట్యాదులను పరికించి స్వబుద్ధితో విచారించవలెను.

## **చతుర్థభావము**

చతుర్థస్థానాధిపతి స్వరాశియందు శుభగ్రహములతోడనూ భాగ్యాధిపతితోడనూ కలిసి యుండిన జాతకుడు సామంతుడగును. చతుర్ధాధిపతి లగ్నస్థుడై గురుని యొక్క పూర్ణదృష్టితో చూడబడిన జాతకుడు రాజపూజ్యుడగును. అట్లే చతుర్థాధిపతి గురుదృష్టి కలిగి లాభమునందుండిన లేక గురునిచే చూడబడు చతుర్థాధిపతి చతుర్థస్థానమును చూచుచుండిన అభీష్టములైన వాహనసమూహములను ప్రదానము జేయును. చతుర్థాధిపతి స్వక్షేత్రమునందు లగ్నాధిపతి సహితుడైయున్న జాతకునకప్రయత్నముగనే గృహము లభించును. అనగ జాతకునకు అనుకోకుండ లేక ఎక్కువ ప్రయాస పడకుండ గృహమును పొందు అవకాశము లభించునని అర్థము. ఆ స్థితిలో జాతకునికి హితులనుండి సహాయాదికములు లభించును. అదే లగ్నాధిపయుతుడైన చతుర్థాధిపతి వేరే స్థానమునందున్న ఆ విధముగ గృహయోగము కలుగదు. ఎన్ని పాపగ్రహములైతే ద్వితీయ దశమ చతుర్థ ద్వాదశాధిపతులతో కూడి త్రికములందుందురో ఆ సంఖ్యకు సమానమైన గృహములు దగ్ధములగును. అనగ నాశనమగునని అర్థము.